

యాసిడ్ కలకలం

- బీఎస్సీ నర్సింగ్ విద్యార్థినిపై యాసిడ్‌తో దాడి
- కడిపికొండ గ్రామంలో ఘటన
- ఎంజీఎం ఆస్పత్రికి తరలించిన పోలీసులు
- స్వల్పగాయాలతో యువతి క్షేమం

8



గాయపడిన యువతి

సోషల్ వార్



సామాజిక మాధ్యమ వేదికగా 'పంచాయతీ'

- గ్రామాల, పార్టీల వాట్సాప్ గ్రూపుల్లో రాజకీయ చర్చలు
- ఎవరి వర్గానికి వారు మద్దతుగా పోస్టులు..
- ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం
- పలువురిని ఆలోచింపచేస్తున్న పోస్టులు

జనగామ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల వేళ 'సోషల్ వార్' మొదలైంది. సామాజిక మాధ్యమ వేదికగా 'పంచాయతీ' పోరు రసవత్తరంగా మారింది. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి హడావిడే కనిపిస్తోంది. ఆయా పార్టీల, అభ్యర్థులకు మద్దతుగా సోషల్ మీడియాలో పోస్టులు, కామెంట్లు ప్రత్యక్షమవుతున్నాయి. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా గ్రూపుల్లో పార్టీ శ్రేణులు, అభ్యర్థుల అనుచరులు యాక్టివ్ అయ్యారు. పార్టీలు, అభ్యర్థుల తరపున కార్యకర్తలు, అనుచరులు రాజకీయ పోస్టులతో మద్దతు పొందే ప్రయత్నం చేస్తున్నారు.

గ్రూపుల్లో రాజకీయ చర్చలు

పంచాయతీ ఎన్నికల వేళ వాట్సాప్ గ్రూపులు రాజకీయ చర్చలకు వేదికలుగా మారుతున్నారు. పార్టీలకు సంబంధించిన వివిధ గ్రూపులతో పాటు గ్రామాలు, కులసంఘాలు, యువజన సంఘాల పేర్లతో ఉన్న గ్రూపుల్లో ఎక్కడా చూసిన ఎన్నికలకు సంబంధించిన చర్చలు, పోస్టులే దర్శనమిస్తున్నాయి. నామినేషన్లు వేసిన, బరిలోఉండబోతున్న అభ్యర్థులకు అనుకూలంగా, వ్యతిరేకంగా ఎవరికి వారు పోస్టులు పెడుతూ హీట్ పెంచుతున్నారు. పార్టీ తరపున టికెట్ ఆశించి భంగపడ్డ వారు, వారి అనుచరులు పార్టీని, నేతలను విమర్శిస్తూ పోస్టులు పెడుతున్నారు.

ఓటర్లను ప్రసన్నం చేసుకునేలా..

పంచాయతీ ఎన్నికల్లో గెలిచేందుకు అభ్యర్థులు సోషల్ మీడియాను ఒక అస్త్రంగా మలచుకోవాలని భావిస్తున్నారు. జిల్లాలో ఉన్న ఓటర్లలో పెద్దవారితోపాటు మహిళలు, యువకులు, యువతులకు మొబైల్ ఫోన్లు ఉన్నాయి. మొబైల్ ఫోన్లు ఉన్న ప్రతి ఒక్కరూ గ్రామ, యూత్ వంటి వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపుల్లో ఉంటారు. సోషల్ మీడియాలో అనుకూలమైన పోస్టులు పెట్టడం ద్వారా ఓటర్లను కొంత మేర ప్రసన్నం చేసుకోవచ్చనే ఆలోచన అభ్యర్థుల్లో ఏర్పడుతోంది. దీనికోసం తమకు అనుకూలంగా పోస్టర్లు, కరపత్రాలు ముద్రించడం, పాటలు పాడించుకోవడం వంటి వాటిపై దృష్టి పెడుతున్నారు. వీటిని సోషల్ మీడియా ద్వారా నేరుగా ఓటర్ల వద్దకు చేర్చవచ్చని అభిప్రాయపడుతున్నారు.


ఆలోచింపచేస్తున్న పోస్టులు

జిల్లాలో పంచాయతీ ఎన్నికల జోరు ఊపందుకుంది. మొత్తం మూడు విడతల్లో ఎన్నికలు జరుగుతుండగా, ఇప్పటికే సోషల్ మీడియా కేంద్రంలో ప్రచారం ఊపందుకుంది. సోషల్ మీడియా వేదికగా ఓ వైపు ఆయా రాజకీయ పార్టీల సోషల్ మీడియా శ్రేణులు పోస్టుల పెడుతుండగా మరో వైపు రాజకీయాలకు దూరంగా ఉండే కొందరు యువకులు, ఉద్యోగులు పెడుతున్న పోస్టులు ఆలోచింపజేసేలా ఉంటున్నాయి. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి గతాన్ని, భవిష్యత్తులో చేయబోయే మంచిని చూసి ఓటేయాలంటూ చేసే సూచనలు ఆకట్టుకుంటున్నాయి. అలాగే పోటీ చేసే అభ్యర్థులకు సైతం ముందస్తు హెచ్చరికలు జారీ చేసే విధంగా మరి కొన్ని పోస్టులు కనిపిస్తున్నాయి. 'చుట్టూ ఉన్న వాళ్లను నమ్మి పోటీ చేయకు. నమ్ముకున్న వాళ్లే నిన్ను అమ్మేస్తారు. ఇవి మంచి రోజులు కావు, ముంచేసే రోజులు' అంటూ ఓ పోస్ట్ వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతోంది. ఎన్నికలు ముగిసే వరకు అభ్యర్థి డబ్బులతో తాగి, తింటూ ఎంజాయ్ చేసే వర్గం అక్కడక్కడ గ్రామాల్లో కనిపిస్తుంటుంది. గెలుస్తావంటూ ఊదరగొట్టి తీరా ఓడిపోయాక మొఖం చాటేసే వారు చాలా మంది ఉంటారు. ఆ తరహాకు చెందిన వారిని ఉద్దేశిస్తూ వస్తున్న పోస్టులు అభ్యర్థులతోపాటు జనాలను ఆలోచింపజేస్తున్నాయి.



హనుమకొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవానికి ఓటర్లు మొగ్గు చూపుతున్నారు. ఇందుకు పలు కారణాలు దోహదం చేస్తున్నాయి. మొదటి విడత ఎన్నికల్లో నామినేషన్ల దాఖలు పరిశీలన ప్రక్రియ, చెల్లించిన నామినేషన్ల జాబితా ప్రకటన పూర్తయిన నేపథ్యంలో ఏకగ్రీవాలపై స్పష్టత వచ్చింది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 19 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. వీటిలో హనుమకొండ జిల్లాలో 2, వరంగల్ జిల్లాలో 5, జనగామ జిల్లాలో 6, మహబూబాబాద్ జిల్లాలో 3, ములుగు జిల్లాలో 2, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1 జీపీ ఏకగ్రీవం అయ్యాయి.



ఏకగ్రీవానికే జై

- ఏకగ్రీవాల దోహదానికి ఎన్నో కారణాల ప్రభావం
- రెండు జీపీల్లో రూ.8లక్షల చొప్పున నిధుల ఆశ
- మరో రెండింటిలో మంత్రి, మాజీ ఎమ్మెల్యే చొరవ
- మిగతావాటిల్లో అభివృద్ధి హామీలు, ఐక్యత, ఏకైక అభ్యర్థిత్వం
- ఎస్టీ రిజర్వుడు పంచాయతీల్లోనే ఎక్కువ ఏకగ్రీవాలు

హామీలు, ఐక్యత, నిధులు

ఈ గ్రామ పంచాయతీలు ఏక్రగీవం కావడం వెనుక అనేక కారణాలు దోహదం చేశాయి. గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇవ్వడం, పోటీలో నిలబడిన వ్యక్తి పట్ల గౌరవం, అభిమానం ఉండడం, మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవడం, ఒకే సామాజికవర్గానికి చెందిన వారే ఉండడం, ఎస్టీ మహిళకు రిజర్వు అయిన స్థానంలో పంచాయతీలో మొత్తంగా ఆ సామాజికవర్గానికి చెందిన ఒక్క మహిళ ఉండడం, ఎన్నికల పేరుతో గొడవలు వద్దని, కలిసికట్టుగా ఉందామని ఐక్యంగా ఒక నిర్ణయం తీసుకోవడం, ముఖ్యంగా రెండు గ్రామ పంచాయతీలు- రామోజీకుమ్మరిగూడెం, చంద్రుతండా అభ్యర్థులు గ్రామాభివృద్ధికి రూ.8 లక్షల చొప్పున నిధులు ఇస్తామని ముందుకు రావడం తదితర కారణాలవల్ల ఈ పంచాయతీల్లో ఏకగ్రీవానికి దారులు సుగమం అయ్యాయి. ఏకగ్రీవం కోసం ఎక్కడా వేలం పాటలు జరగకపోవడం, ఏకగ్రీవమైన దాదాపు అన్ని పంచాయతీల్లో జనాభా 5వేలలోపే ఉండడం గమనార్హం.

హనుమకొండ జిల్లాలో రెండు..

హనుమకొండ జిల్లాలో 2 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. ఒకటి శాంతినగర్, రెండోది వీర్లగడ్డతండా. ఎల్కతుర్తి మండలంలోని శాంతినగర్ గ్రామ పంచాయతీ ఏకగ్రీవం కావడానికి ఆ పంచాయతీ పరిధిలో దాదాపు అందరూ ఒకే సామాజికవర్గానికి (కన్వర్టెడ్ క్రిష్టియన్స్) చెందినవారు ఉండడంతో పాటు,

ఉమ్మడి జిల్లాలో మొదటి విడతలో 19 పంచాయతీలు

ఇక్కడ జనాభా అతితక్కువగా ఉండడం కారణం. గత పంచాయతీ ఎన్నికల్లో కూడా శాంతినగర్ ఏకగ్రీవమైంది. అప్పుడు సర్పంచ్‌గా మహిళా అభ్యర్థి వేలంగిని మేరీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సారి కూడా తిరిగి ఆమే ఎన్నికయ్యారు. అలాగే భీమదేవరపల్లి మండలంలోని వీర్లగడ్డతండా గ్రామ పంచాయతీ ఏకగ్రీవమైంది. ఇక్కడ ఎస్టీ అభ్యర్థి గుగులోతు పూర్ణిమ సర్పంచ్ గ్రామ పంచాయతీని సర్వతోముఖంగా అభివృద్ధి చేస్తానని ఇచ్చిన హామీ మేరకు మిగతా వారు ఎవరూ నామినేషన్లు వేయకపోవడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పూర్ణిమ భర్త భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ కార్యదర్శి. అంతేకాకుండా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామాభివృద్ధికి ఇచ్చిన హామీ కూడా ఇందుకు కారణమైంది.

ములుగు జిల్లాలో రెండు..

ములుగు జిల్లాలో రెండు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. గోవిందరావుపేట మండలం కోటగడ్డ ఎస్టీ మహిళకు రిజర్వు అయింది. ఈ పంచాయతీలో ఎస్టీ మహిళ మహిళ బానోతు లిల్లీ ఒక్కరే ఉండడంతో ఒక్క నామినేషనే దాఖలైంది. దీనితో ఆమె ఏకగ్రీవం ఖాయమైంది. అదే మండలంలోని చల్వాయి పంచాయతీ స్థానం ఎస్టీ మహిళకు రిజర్వు కాగా, కాంగ్రెస్ బలపర్చిన మేకల రాధ సర్పంచ్‌గా ఏక్రీవమయ్యారు. ఈ పంచాయతీ సర్పంచ్ స్థానానికి ఏడుగురు నామినేషన్లు వేశారు. డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్ని పార్టీల నాయకులు, అభ్యర్థులతో మాట్లాడి

(మిగతా 7లో..)



బచ్చన్నపేటలో నామినేషన్ పత్రాలు స్వీకరిస్తున్న అధికారులు

నామినేషన్లు సజావుగా సాగాలి

బచ్చన్నపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగాలని జిల్లా ఎన్నికల అబ్జర్వర్ టి.రవికిరణ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జీపీలో ఏర్పాటు చేసిన క్లస్టర్ కేంద్రంతో పాటు పోచన్నపేటలోని కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషాతో కలిసి పరిశీలించారు. నామినేషన్ దాఖలైన గ్రామాల వివరాలు, అభ్యర్థుల సంఖ్య, టీపోల్ ఎంట్రీ ప్రక్రియ పరిశీలించారు. ఎన్నికల విధులకు సంబంధించిన శిక్షణ కార్యక్రమాలు పూర్తి అయ్యాయా అని అడిగి తెలుసుకున్నారు. నామినేషన్లు వేయటానికి వచ్చిన పలువురితో మాట్లాడారు. ఫామ్స్ నింపే విధానంపై అవగాహన ఉందా అని అడిగారు. హెల్ప్‌డెస్కుల పని తీరు గురించి అక్కడికి వచ్చిన అభ్యర్థుల నుండి తెలుసుకున్నారు. నామినేషన్ ప్రక్రియకు మంగళవారం చివరి రోజు కావటంతో గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ దండోరా వేయించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామానుజాచారి, ఎంపీడీవో మమతాబాయి, సీఐ అబ్బయ్య, ఎస్ఐ హమీద్ తదితరులున్నారు.

- అవినీతి చిట్టా తెలుసుకొని ఏసీబీ పేరిట గాలం
- పత్రికల్లో అవినీతి కథనాలు చూసి స్కెచ్
- ఎంపీఐ తుమ్మల జైపాల్‌రెడ్డికి బెదిరింపులు
- ఆన్‌లైన్‌లో రూ.9లక్షల96 వేలు వసూలు
- ముఠాను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్, మిల్స్‌కాలనీ పోలీసులు
- ప్రధాన నిందితుడిది ఏపీ, మిగతావారిది కర్నాటక
- కమిషనరేట్‌లో వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్

యమ కిలాడీ.. ఈ నకిలీ డీఎస్పీ..

వివరాలు : 7లో



వివరాలు వెల్లడిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్



చరణ్‌కు బహుమతిని అందిస్తున్న అడిషనల్ కలెక్టర్ పింకేష్‌కుమార్

రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టు

జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో చరణ్ ప్రతిభ

జఫర్‌గఢ్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో మండలంలోని తిడుగు జడ్పీ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి ఎన్.చరణ్ ప్రదర్శించిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. జనగామలో నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్ స్పైర్, సైన్స్ ఫెయిర్ పోటీల్లో తిడుగు విద్యార్థి మాడ్రన్ బుల్లెక్ కార్ట్ (ఆధునిక ఎద్దుల బండి) అనే ప్రాజెక్టును ప్రయోగాత్మకంగా ప్రదర్శిస్తూ వివరించాడు. ఆధునిక ప్రపంచంలో ఈ ప్రాజెక్టు గ్రామీణ ప్రాంత ప్రజలు, రైతులకు ఎలా ఉపయోగకరమైనదో సోదాహరణంగా వివరించడంతో విద్యార్థి శాస్త్రీయ విజ్ఞానాన్ని న్యాయనిర్ణేతలు అభినందిస్తూ త్వరలో కామారెడ్డిలో జరిగే రాష్ట్ర స్థాయి ఇన్ స్పైర్ పోటీలకు ఎంపిక చేశారని హైస్కూల్ » మిగతా 8వ పేజీలో...

కొనసాగిన నామినేషన్ల పర్వం

నేటితో ముగియనున్న రెండో విడత నామినేషన్ల స్వీకరణ

పంచాయతీ ఎన్నికల నామినేషన్ కౌంటర్ — రెండో రోజు 01-12-25

మండలం పేరు	సర్పంచ్ స్థానాలు	దాఖలైన నామినేషన్లు	వార్డు సభ్యులు	దాఖలైన నామినేషన్లు
జనగామ	21	=	198	=
నర్మెట	17	50(53)	148	68(70)
తరిగొప్పుల	15	32(40)	126	86(104)
బచ్చన్నపేట	26	56(90)	238	202(237)
మొత్తం	79	318(183)	710	365(411)

నోట్: (బ్రాకెట్)లో ఇప్పటి వరకు దాఖలైన మొత్తం నామినేషన్ల సంఖ్య

జనగామ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండో విడత నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. రెండో రోజైన సోమవారం పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. రెండో విడతలో భాగంగా జనగామ, బచ్చన్నపేట, నర్మెట్ట, తరిగొప్పుల మండలాల్లోని 79 గ్రామ పంచాయతీలు, 710 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. నర్మెట మండలంలో సర్పంచ్ స్థానాలకు 50, వార్డులకు 68 నామినేషన్లు వచ్చాయి. అలాగే తరిగొప్పుల మండలంలో సర్పంచ్‌కు 32, వార్డులకు 86, బచ్చన్నపేట మండలంలో 56 సర్పంచ్‌కు, 202 వార్డులకు నామినేషన్లు దాఖలయ్యాయి. జనగామవి రాత్రి వరకు కొనసాగాయి. రెండో విడతకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మంగళ వారంతో ముగియనుంది.

●నర్మెట: మండలంలోని » మిగతా 8వ పేజీలో...

పార్టీ కోసం పనిచేసిన వారికే అవకాశాలు : శ్రీహరి



ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పద్మారెడ్డి, నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పనిచేసిన వారికే అవకాశాలు వస్తాయని, అంతవరకు ఓపిక పట్టాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ పాలకమండలిలో ఖాళీగా ఉన్న డైరెక్టర్ పదవిని అప్పగిస్తామని తానేదార్‌పల్లి నుంచి కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా బరిలో ఉన్న దుంపల పద్మారెడ్డికి ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో పద్మారెడ్డి అలకవీడాడు. అనంతరం గ్రామ నాయకులతో కలిసి వెళ్లి ఎమ్మెల్యే కడియంను హన్మకొండలోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అవకాశం రాలేదని పార్టీకి దూరం కావద్దని, ఏదో రకంగా ప్రతీ ఒక్కరికీ అవకాశాలు వస్తాయన్నారు. గ్రామాల్లోని మెజార్టీ కాంగ్రెస్ నాయకులు ఎంపిక చేసిన వాళ్లకే అవకాశం కల్పించామన్నారు. పార్టీ నుంచి రెబల్ అభ్యర్థులుగా బరిలో నిలిచిన విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, పార్టీ నాయకులు మంతెన ఇంద్రసేనారెడ్డి, కుమారస్వామి, ఎర్రెడ్డి లింగారెడ్డి, గాదె చంద్రయ్య, గాదె సుధాకర్, కృష్ణంరాజు, భిక్షపతి పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసే పార్టీలో చేరుతున్నారు..: యశస్వినిరెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో ఎమ్మెల్యే

పాలకుర్తి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : ఈరవెన్నుకు చెందిన బీఆర్ఎస్, సీపీఎం పార్టీల నుంచి సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీర్రు సోమేశ్వర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడు తూ గ్రామాల అభివృద్ధితోపాటు కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూసే కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు గోనె మహేందర్, గాదరి కుమారస్వామి, అనుముల రమేష్, తొడుసు మల్లేష్, లొంక ఐలయ్య, రాజశేఖర్, దామెర పెద్ద మల్లయ్య, ముత్తయ్య ఉన్నారు. అలాగే తొర్రూరు వడ్డెరకాలనీకి చెందిన టీఆర్ఎస్ కార్యకర్తలు క్యాంపు కార్యాల యంలో అలకుంట్ల వెంకన్న ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, చిలువేరు బాలరాజు, కృష్ణమూర్తి, మార్కెట్ వైస్ చైర్మన్ అనుముల మల్లారెడ్డి, పసులాది ఐలయ్య తదితరులు ఉన్నారు.

జనగామలో వైభవంగా గీతాజయంతి

జనగామ కల్చరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గీతా జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. సోమవారం విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రంలోని గ్రెయిన్ మార్కెట్ శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో భగవత్ 'గీతాజయంతి - శౌర్య దినోత్సవ' వేడుకలు జరిగాయి. వీహెచ్‌పీ కార్యకర్తలు, దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు, యువకులు శ్రీకృష్ణుడి విగ్రహానికి ఆరాధనలు, ప్రధానార్చకులు పిట్టల రాములు స్వామి నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు భగవద్గీత పఠనం చేశారు. వీహెచ్‌పీ నిర్వాహకులు డాక్టర్ మోహనకృష్ణ భార్గవ పాల్గొని మాట్లాడుతూ భగవద్గీత ప్రాముఖ్యతను తెలియజేశారు. యువత హిందూ ధర్మ పరిరక్షకులుగా నిలవాలని కోరుతూ సంకల్పం చెప్పి ప్రతిజ్ఞ చేయించారు. భగవద్గీత ప్రతీ గృహంలో తప్పక ఉండాలని, పాఠ్య పుస్తకాల్లో భగవద్గీతను చేర్చాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు చిలువేరు హర్షవర్ధన్, కుందారపు భైరునాథ్, శివరామ్, సనత్, మాడిశెట్టి రవి, వెంకన్న, కందుకూరి కైలాసం, ఉపేందర్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మోహనకృష్ణ

ఎయిడ్స్‌ను నిర్మూలించాలి

ఘనంగా ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం

జనగామ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తా నుంచి కలెక్టర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించగా డీఎంహెచ్‌వో మల్లిఖార్జున రావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు, చికిత్స సదుపాయాలను అందిస్తుందన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన వైద్య సిబ్బందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు అశోక్, కమలహాసన్, శ్రీతేజ, ప్రభాకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



ఎయిడ్స్ డే సందర్భంగా జనగామలో ర్యాలీ

చావులోనూ వీడని బంధం

● ఒకే రోజు గంటల వ్యవధిలో భార్యాభర్తల మృతి

● మండెలగూడెంలో విషాదం



బత్తిని ఎల్లమ్మ-సత్తయ్య దంపతులు (ఫైల్)

రఘునాథపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భార్యా భర్తలు ఒకేరోజు గంటల వ్యవధిలో మృతి చెందిన ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండెల గూడెంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం...గ్రామానికి చెందిన బత్తిని ఎల్లమ్మ(55)-సత్తయ్యగౌడ్(65) దంపతులు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కులవృత్తి చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే వాడు. 15ఏళ్ల క్రితం వ్యవసాయ కూలి పనికి ఆటోలో వెళ్తుండగా ఆటో బోల్తా పడిన ఘటన ఎల్లమ్మ వెన్నుముక తీవ్రంగా దెబ్బతింది. అప్పటి నుంచి ఇంట్లోనే ఉంటూ విశ్రాంతి తీసుకుంటోంది. సత్తయ్య అస్తమాతో కొంతకాలంగా ఇబ్బంది పడుతున్నాడు. సోమవారం ఉదయం 6.30 గంటలకు ఎల్లమ్మ మృతి చెందింది. వారం రోజుల నుంచి అస్తమాతో తీవ్ర ఇబ్బందిపడుతున్న సత్తయ్య ఇంట్లోనే ఆక్సీజన్ పెట్టుకుంటూ ఉన్నాడు. భార్య విషయం తెలియగానే ఉదయం 8 గంటల సమయంలో తనూ కన్ను మూశాడు. 40ఏళ్లు ఒకరికొకరు తోడుగా ఉన్న భార్యాభర్తలు ఒకే రోజు మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. దీంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

మానుకోటలో తొమ్మిది వార్డులు ఏకగ్రీవం

● రోటిబండతండాలోనే ఆరు వార్డులు..

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తొలి విడతలో ఎన్నికలు జరిగే మహబూబాబాద్ మండలంలో 41 గ్రామ పంచాయతీల పరిధిలో 338 వార్డులుండగా అందులో తొమ్మిది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇందులో రోటిబండతండాలో 8 వార్డులుండగా 1వ వార్డు భూక్య సంధ్య, 3వ వార్డు బానోతు బాలాజీ, 4వ వార్డు అజ్మీరా లక్ష్మి, 6వ వార్డు బానోతు వీరన్న, 7వ వార్డు బోడ చక్రి, 8వ వార్డు ఆంగోతు ఆలు ఆయా వార్డుల్లో ఒక్కొక్క నామినేషన్ వేయగా వారు ఏకగ్రీవం కాగా, తూర్పుతండాలో 7వ వార్డు దారావత్ శారద, 8వ వార్డు అజ్మీరా కోటేష్, కేవ్లాతండాలో 2వ వార్డు బానోతు రేవతి ఆయా వార్డుల్లో ఒక్కొక్క అభ్యర్థి మాత్రమే నామినేషన్ వేయగా వారు ఏకగ్రీవంగా ఎన్నికైనప్పటికీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



అధికారులకు వందన సమర్పణ చేస్తున్న విద్యార్థులు

చిన్నగూడూరు (మరిపెడ), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడా పోటీలలో రాణించాలని చిన్నగూడూరు తహసీల్దార్ సంపత్ అన్నారు. సోమవారం మండలంలోని జయ్యారం హై స్కూల్ విద్యార్థులకు వివిధ రకాల స్కూల్ గేమ్స్ నిర్వహించారు. ఈ పోటీలను తహసీల్దార్ ప్రారంభించి మాట్లాడారు. క్రీడా పోటీల్లో రాణిస్తే స్పోర్ట్స్ కోటా కింద విద్యా, ఉద్యోగ నియామకంలో రిజర్వేషన్ వర్తిస్తుందని గుర్తుచేశారు. విజేతలకు బహుమతులను అందచేశారు. ఇన్‌స్పైర్ సైన్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనా గైడ్ టీచర్ ఫిరోజ్, రాఘవలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రవీణ్, ఎంపీడీవో సుజాత, ఎంఈవో రవికుమార్, హెచ్ఎం ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక రంగ సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తొర్రూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్మికరంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ప్రక్షాళన చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అభివృద్ధి పనులకు జరుగుతున్న నిర్మాణాల్లో కోట్లాది మంది కార్మికుల శ్రమ ఉందని, కార్మిక వర్గానికి ప్రత్యేక కోడ్‌లు తీసుకురావాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మికులను విస్మరిస్తూ కొత్త లేబర్ కోడ్‌లు తీసుకువచ్చిందని, దీనికి వ్యతిరేకంగా కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మికరంగ సమస్యలకు నిరంతర పోరాటాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరన్న, పుల్లయ్య, శ్రీనివాస్, వెంకటకృష్ణ తదితరులు ఉన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తొర్రూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యురాలు నందనాదేవి అన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ సందర్భంగా ఆరోగ్య సిబ్బందితో కలిసి ర్యాలి నిర్వహించి ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి గ్రస్తుల పట్ల వివక్ష చూపకూడదని, ఎయిడ్స్‌కు మందు లేదని నివారణ ఒక్కటే మార్గమన్నారు. ఏఆర్‌టీ మందుల వాడకం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సుగుణాకర్‌రాజు, మీరజ్, గిరిప్రసాద్, శంకర్, అనిల్, వనాకర్ రెడ్డి, విద్యాసాగర్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



రాంపురం బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి కొమ్ము చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న మాజీ మంత్రి రెడ్యానాయక్

పని చేసే కార్యకర్తలకే గుర్తింపు

చిన్నగూడూరు (మరిపెడ), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పని చేసే కార్యకర్తలకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందని మాజీ మంత్రి ధరంసోత్ రెడ్యానాయక్ అన్నారు. సోమవారం చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లిలోని రెడ్యానాయక్ ఇంట్లో రాంపురం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశమై ఆ ఊరు సర్పంచ్ అభ్యర్థిగా కొమ్ము చంద్రశేఖర్‌ను ప్రకటించగా రెడ్యా ఆయనను బీఆర్ఎస్ కండువావేసి అభినందించారు. ఏ ఊరికి ఆ ఊరులో బీఆర్ఎస్ కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ఓటర్లను అభ్యర్థించి బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించు కోవాలన్నారు. కష్టపడే కార్యకర్తలకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. మరిపెడ మాజీ వైస్ ఎంపీపీ అశోక్‌రెడ్డి, రాంపురం బీఆర్ఎస్ నాయకులు రాంపెల్లి రవి, కొమ్ము నరేశ్, దోమల సత్తయ్య, బంధు పరుశరాములు తదితరులు ఉన్నారు.

నాలుగు తరాలు ఒకే వేదికపై...

● కుటుంబ విలువలకు అర్థం చెప్పిన విహారయాత్ర



నాలుగు తరాల మేరుగువారి కుటుంబం ఇదే

గూడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచం వేగంతో పరుగెత్తుతుంది.. జీవితం కోసం మనుషులు పరుగెత్తుతున్నారు. ఆ పరుగులో బంధాలు, అనుబంధాలు, కుటుంబ విలువలు కోల్పోతున్న ఈ కాలంలో ప్రేమతో ఉన్న కుటుంబం కన్న గొప్ప సంపద ఏదీ లేదు అని నిరూపించారు మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రానికి చెందిన గౌడ సామాజిక వర్గానికి చెందిన మేరుగు వారి కుటుంబ సభ్యులు. అనుబంధాల ఆధ్యా త్మిక ఆలయంలా ఒకే ఫ్రేమ్‌లో నాలుగు తరాలకు చెందిన కుటుం బీకులు ఒకరిచేతిని మరొకరు పట్టుకుని సంతోషంగా గడిపారు. అందరు కలిసి విహారయాత్రకు వెళ్లి ప్రయాణం మొత్తం నవ్వుల తో నిండిపోగా.. ఆట.. పాటలతో ఊరటగా ఒకరి కష్టసుఖాలను ఒకరినొకరు చెప్పుకున్నారు. కన్నీటిపర్యంతమయ్యారు. సెల్‌ఫోన్‌లు పక్కన పెట్టి స్మార్ట్‌ఫోన్ కెమెరాలు కాకుండా మనసు కెమెరాల ద్వార జ్ఞాపకాలను బంధించుకున్నారు. ఇలాంటి క్షణాలు దొరకడం చాలా అరుదు.. చాలా మంది పండుగలను కూడ కలువలేని ఈ రోజుల్లో మేరుగువారి కుటుంబం ఒక సాధారణ రోజునే పండుగగా మార్చుకున్నారు. చిన్నప్పుడు బంధువల ఇండ్ల నుంచి తిరిగి వస్తున్నప్పుడు ఎలా కన్నీళ్లను దాచుకుని చేతులు ఊపుకునే వారో అదే దృశ్యాలు మళ్లీ పునరావృతమయ్యాయి. ఆ ప్రేమ.. ఆ దగ్గరితనం.. ఆ విడిపోవడంలోని బాధ అన్ని కలిసి అద్భుతమైన హృదయానుభూతిని పంచాయి. ఇకపై ఇలా కలు సుకోవడం పండుగ కాదు.. ఆలవాటు కావాలి అని ఒకరిచేతిలో మరొకరు చేయి వేసుకుంటూ ప్రయాణం కొనసాగించారు.

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి



నామినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న రాష్ట్ర న్నికల అబ్జర్వర్ మధుకర్

తొర్రూరు రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ కె.మధుకర్‌బాబు సూచించారు. సోమవారం రెండో విడత నామినేషన్ ప్రక్రియను, మండలంలోని నాంచారిమడూరు, గుర్తూర్, అమ్మాపురం, మడిపల్లి గ్రామాల్లోని నామినేషన్ కేంద్రాల్లోని వసతులను ఎన్నికల అబ్జర్వర్ కె.మధుకర్ బాబు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామ న్నారు. నామినేషన్ స్వీకరణ పూర్తిస్థాయిలో పారదర్శకతతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తొర్రూరు ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో పూర్ణచందర్, ఆర్.ఐ నజీముద్దీన్, పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలు ఉన్నారు.

● మరిపెడ (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రర్ల, బీచ్‌రాజ్‌పల్లి, ఉల్లెపల్లి, అబ్బాయిపాలెంలోని నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు, ఆయా గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను సోమవారం మరిపెడ ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు. డిసెంబర్ 3వ తేదీ నుంచి మరిపెడ మండలంలోని 48 జీపీలకు, 396వార్డులకు సర్పంచ్, వార్డు అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. అందుకు తగిన ఏర్పాట్లను ఎంపీడీవో పరిశీలించి స్థానిక అధికారులకు, పంచా యతీల సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎంపీవో సోమ్లా నాయక్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషిచేయాలి



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో

పెద్దవంగర, డిసెంబరు 1 (ఆంధ్ర జ్యోతి):విద్యార్థులు లక్ష్య సాధనకు నిరంతరం కృషిచేయాలని ఎంఈవో బుధరపు శ్రీనివాస్ అన్నారు. సోమ వారం మండలంలోని పోచంపల్లి ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందిస్తూ అన్ని సౌకర్యాలను కల్పించారన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివి సమాజ అభ్యున్నతి కోసం పాటుపడాలని కోరారు. విద్యార్థులు సమాజానికి మార్గనిర్దేశులుగా ఉండాలన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదిత రులు పాల్గొన్నారు.

భూపాలపల్లి ఏరియాలో 68 శాతం బొగ్గు ఉత్పత్తి

కృష్ణకాలనీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియాలో నవంబరు మాసంలో 68 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 4.45 టన్నులు కాగా 3.02 టన్నులు సాధించినట్లు తెలిపారు. ఓబీ వెలికితీతలో 51.50 క్యూబిక్ మీటర్లకు 3.69 క్యుబిక్ మీటర్లతో 73 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఏరియాకు కేటాయించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికల సిద్ధం చేసినట్లు తెలిపారు.

వైభవంగా గీతా జయంతి వేడుకలు



రామాలయంలో గీతా జయంతి వేడుకల్లో ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

ఏటూరునాగారం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని శ్రీసీతారామ చంద్రస్వామి(రామాలయం)లో వేంకటేశ్వర స్వామి, అలివేలు మంగా, పద్మావతి అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రామాలయ ప్రాంగణంలో నిర్మించిన కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం ఆయన కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. అర్చకులు ఎల్లాప్రగడ నాగేశ్వరరావు శర్మ, మణికంట శర్మ, హయగ్రీవాచారి పర్యవేక్షణలో వేద మంత్రోచ్చారణల మధ్య కల్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామాలయం ఆలయ కమిటీ చైర్మన్ అలువాల శ్రీనివాస్, కమిటీ సభ్యులు కత్తెర శ్రీనివాస్, తాడూరి దీనబంధవాస్వామి, గుంత రమేష్, నూక ప్రభాకర్, గంజి రమేష్, అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ బోలుసాని గౌరీ శంకర్, సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, అయ్యప్ప గురు స్వాములు వసంత రమేష్, సిద్ధు, సమ్మయ్య, మైనర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో సామూహిక భిక్షలు



అయ్యప్ప దీక్షలో ఉన్న స్వాములు

కాటారం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీఆనంద ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప దీక్షాపరులకు సామూహిక భిక్షలు (అన్నదానాలు) సోమవారం ప్రారంభమయ్యాయి. వచ్చే ఏడాది జనవరి 15 వరకు జరిగే నిత్యాన్నదానానికి దాతలు సహకరించాలని ఆలయ కమిటీ ప్రతినిధులు బచ్చు అశోక్, బచ్చు ప్రకాష్, పీచర రామకృష్ణారావు, జక్కు మొగిళి, రంజిత్‌కుమార్, పసుల రాంచంద్రం కోరారు. గురుస్వాములు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం దీక్షాపరులతో పాటు నైవేద్యం సమర్పించారు. సామూహిక భిక్షల మొదటి రోజున దాతలు మాజీ ఎంపీడీవో పెద్ది అంజనేయులు, మేకల రాజేందర్ అయ్యప్ప దీక్షాపరులకు అన్నదానం చేశారు. అన్నదానం మహాదానమని, దీక్షాపరులకు అన్నదానం చేయడం గొప్ప వరమని, మార్గశిర మాసంలో అయ్యప్ప దీక్ష స్వీకరించిన వారికి స్వామి వారి కృప కలుగుతుందని అర్చకుడు భానుప్రసాద్‌శర్మ తెలిపారు. 45రోజుల పాటు సాగే అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి దాతలు సహకరించాలని కోరారు.


మందకొడిగా ధాన్యం సేకరణ



తేమ శాతం పరిశీలిస్తున్న ఏఈవో అస్మా

కాటారం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ మందకొడిగా సాగుతోంది. పీపీసీలు ప్రారంభమై రోజులు గడుస్తున్నా, వడ్లను ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కాంటాల కోసం రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. యాసంగి ప్రారంభం కావడం, కుటుంబ అవసరాల కోసం డబ్బులు అవసరం ఉండటంతో రైతులు ధాన్యం అమ్మి ఖర్చులు పెట్టడానికి ఎదురుచూస్తున్నారు. వడ్లను ప్యాడీ క్లీనర్ల ద్వారా శుభ్రం చేయడంతోపాటు తేమ శాతం 17లోపు ఉండేలా ఆరబోయడానికి రోజులు గడుస్తున్నాయని, ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్యాడీ క్లీనర్లు సరిపడా లేకపోవడంతో వేచిచూడాల్సిన పరిస్థితి ఉంది. వడ్ల తేమ శాతాన్ని సంబంధిత క్లస్టర్ ఏఈవో పరిశీలించి సర్టిఫై చేసిన తర్వాతే కాంటాలు పెట్టాలని అధికారులు ఆదేశించడంతో కేంద్రాలను ఏఈవోలు సందర్శించి మాయిశ్చర్ మిషన్లతో తేమశాతాలు నమోదు చేస్తున్నారు. జిల్లా అధికార యంత్రాంగం స్పందించి రైతులు పడుతున్న ఇబ్బందులకు పరిష్కారం చూపాలని, వడ్లను వెంటనే కాంటాలు చేసి బస్తాను మిల్లులకు తరలించి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని వారు కోరుతున్నారు.

నామినేషన్ కేంద్రం వద్ద స్వల్ప ఉద్రిక్తత



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న అభ్యర్థులు

ములుగు రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా జేడీ మల్లంపల్లి నామినేషన్ కేంద్రం వద్ద సోమవారం స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. మహ్మద్‌గౌస్‌పల్లి గ్రామ పంచాయతీకి చెందిన సర్పంచ్, వార్డు అభ్యర్థులు (కాంగ్రెస్) నామినేషన్ పత్రాలు సమర్పించేందుకు మూకుమ్మడిగా వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఒక్కొక్కరు మాత్రమే వెళ్లాలని సూచించారు. దీంతో పోలీసులకు, నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో కొద్ది సేపు స్వల్ప ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతి చెందిన కోటె సంతోష్

తాడ్వాయి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిసిన వివరాల ప్రకారం.. గోవిందరావుపేట మండలం ప్రాజెక్టునగర్‌కు చెందిన కోటె సంతోష్(42) బతుకుదెరువు కోసం భూపాలపల్లిలో నివసిస్తున్నాడు. అక్కడి నుంచి తాడ్వాయి మండలం మేడారం గ్రామానికి నూతన గృహప్రవేశ వేడుకల కోసం ఆదివారం ఉదయం తన ద్విచక్రవాహనంపై వచ్చాడు. జాతర అభివృద్ధి పనుల్లో భాగంగా నార్లాపూర్ శివారు బయ్యక్కపేట రోడ్డు మరమ్మతులు జరుగుతుండటంతో తిరుగు ప్రయాణంలో అటు వైపు వెళ్లిన సంతోష్ ద్విచక్రవాహనం అదుపు తప్పింది. బైక్ పైనుంచి ఎగిరి కంకర రాళ్లలో పడటంతో తీవ్ర రక్తస్రావమై అతడు మృతి చెందాడు. మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రెండు సీసీ కెమెరాల చోరీ

ముగ్గురిపై కేసు నమోదు

కృష్ణకాలనీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణంలోని జవహర్‌నగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు చోరీకి గురయ్యాయి. దీనికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీసీ కెమెరాలు అపహరణకు గురయ్యాయని వచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, సాంకేతిక ఆధారాలు పరిశీలించగా అదే కాలనీకి చెందిన మహ్మద్ సోను, మారాయి శివ చరణ్, బొప్ప అఖిల్ ఎత్తుకెళ్లినట్టు గుర్తించామని పేర్కొన్నారు. దీంతో ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి మరింత దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాలనీల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎత్తుకెళ్లడం, ధ్వంసం చేయడం వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

కాళేశ్వరం బీసీ జేఏసీ అధ్యక్షుడిగా సమ్మయ్య

మహదేవపూర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళేశ్వరం బీసీ జేఏసీ అధ్యక్షుడిగా అడప సమ్మయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాళేశ్వరంలోని ప్రధాన కూడలిలో జాతీయ బీసీ సంఘం భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జి విజయగిరి సమ్మయ్య, సముద్రాల తిరుపతి, గాండ్ల సంఘం నాయకులు వెన్నంపల్లి మహేష్ ఆధ్వర్యంలో సోమవారం కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎస్.కె.జాని, గౌరవ సలహాదారుగా మెంగాని అశోక్, ఉప ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉప అధ్యక్షులుగా మాచర్ల కిరణ్‌కుమార్, గోర దేవయ్య, కంకణాల బాపు, కోశాధికారిగా బొల్లం సురేష్, ప్రచార కార్యదర్శిగా కీర్తి శంకర్, సోషల్ మీడియా ఇన్‌చార్జిలుగా నాగుల సంతోష్ , కార్యవర్గ సభ్యులుగా సల్పాల శంకరయ్య, మొగిలి, నిట్టూరి సంతోష్, శనిగరం శంకరయ్య, మొగిలి, శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7100	6300
మక్కలు	1811	1521
కందులు	----	----
పెసళ్లు	----	----
పల్లికాయ (సూక)	6350	4860
పల్లికాయ (పచ్చిది)	----	----
పసుపు (కాడి)	12210	10540
పసుపు (గోల)	11555	9880
తేజ మిర్చి	----	----
తేజ మిర్చి ఏసీ	12500	9500
వండర్‌హాట్	----	----
వండర్‌హాట్ ఏసీ	18500	12000
యూఎస్341ఏసీ	16500	9000
దీపిక	----	----
సింగిల్‌పట్టి ఏసీ	----	----
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

రేపటి నుంచి గుర్తుంచుకోవాలి..

- తెలుగు అక్షరమాల ప్రకారం వరుస
- ఉపసంహరణల అనంతరం గుర్తుల కేటాయింపు
- ఇద్దరున్న చోట ఉంగరం, కత్తెర, నోటా తప్పనిసరి
- ఈసారి 'నోటా'తో అభ్యర్థుల్లో టెన్షన్

కేసముద్రం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల్లో మొదటి విడత అభ్యర్థులకు గుర్తుల కేటాయింపునకు సమయం ఆసన్నమైంది. పోటీలోంచి వైదొలగాలనుకునే వారు డిసెంబర్ 3న మధ్యాహ్నం 3 గంటలలోపు నామినేషన్ వేసిన సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఉన్న అభ్యర్థుల నామినేషన్ ప్రతాల్లో రాసిన పేరులోని మొదటి అక్షరాన్ని తీసుకొని రిటర్నింగ్ అధికారి తెలుగు వర్ణమాల ప్రకారం జాబితాను తయారు చేసుకుంటారు. ఒకవేళ ఇంటిపేరును ఆంగ్లంలో, పేరును తెలుగులో రాసినట్లయితే పేరులోని మొదటి అక్షరాన్ని తీసుకుంటారు. అభ్యర్థుల ఇద్దరి పేర్లు ఇంటిపేరుతో సహా ఒకే విధంగా ఉంటే మొదట నామినేషన్ ఎవరు వేస్తారో వారి పేరును ముందు చేరుస్తారు. ఇలా వరుస క్రమంలో చేసిన అనంతరం ఎన్నికల కమిషన్ నిర్ణయించిన గుర్తులను వరుస సంఖ్య ప్రకారం కేటాయిస్తారు.

సర్పంచ్ అభ్యర్థులకు 32 రకాల గుర్తులను కేటాయిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసింది. సర్పంచ్ స్థానానికి ఉంగరం, కత్తెర, బ్యాట్, ఫుట్‌బాల్, లేడిపర్స్, టీవీ రిమోట్, టూత్ పేస్టు, స్పానర్, చెత్తడబ్బా, బ్లాక్‌బోర్డు, బెండకాయ, కొబ్బరితోట, డైమంట్, బకెట్, డోర్ హ్యాండిల్, టీ జల్లెడ, చేతికర్ర, మంచం, పలక, టేబుల్, బ్యాటరీ లైట్, బ్రష్, బ్యాట్స్‌మెన్, మనిషి తెరచాపతో పడవ, బిస్కెట్, వేణువు, చైన్, చెప్పులు, గాలిబుడగ, స్టంప్స్ గుర్తులు ఉన్నాయి. అలాగే వార్డు సభ్యులకు గౌను, గ్యాస్‌స్టౌ, స్టూల్, సిలిండర్, బీరువా, ఈల, కుండ, డిష్ యాంటినా, గరాట, మూకుడు, ఐస్‌క్రీమ్, గాజుగ్లాసు, పోస్టు డబ్బా, కవర్, హాకీకర్ర, బంతి, నెట్, కటింగ్ ప్లేయర్, బాక్స్, విద్యుత్ స్తంభం, కేటిల్ గుర్తులు ఉన్నాయి. బ్యాలెట్ పేపరులో అభ్యర్థుల పేర్లు ఉండవు, కేవలం గుర్తుల పేర్లు, పక్కన గుర్తులు ఉంటాయి. గులాబీ రంగు బ్యాలెట్ సర్పంచ్‌కు, తెలుపు రంగు బ్యాలెట్ పేపర్ వార్డు సభ్యుని స్థానానికి ఉపయోగిస్తారు. ఈ గుర్తులతోపాటు ఈసారి చివరన 'నోటా'ను జతచేస్తున్నారు. సర్పంచ్ స్థానంలో ఒకవేళ ఇద్దరు అభ్యర్థులుంటే ఉంగరం, కత్తెరతోపాటు నోటాకూడా బ్యాలెట్‌లో ఉండనుంది. దీంతో అతితక్కువ ఓట్లు ఉన్న సర్పంచ్, వార్డు స్థానాల్లో ఈ నోటా ఓట్లు అభ్యర్థుల గెలుపును తారుమారు చేసే అవకాశం ఉంది.



ఎన్నికల సంఘం విడుదల చేసిన సర్పంచ్ అభ్యర్థులు గుర్తులు కొన్ని

సర్పంచ్ వేతనం.. నెలకు రూ.6,500 మాత్రమే

పదవి దక్కించుకోవడానికి మాత్రం లక్షల్లో ఖర్చు

వెంకటాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌గా పోటీ చేయడానికి, గెలవడానికి పెద్దసంఖ్యలో ఆశావహులు ఉత్సాహపడుతుంటారు. సర్పంచ్ పదవి దక్కించుకోవడానికి రూ.లక్షల్లో ఖర్చు చేస్తుంటారు. వారి ఉత్సాహం గెలుపొందడానికి వారు పెడుతున్న ఖర్చు చూసి ప్రజలు సర్పంచ్‌కు ఎంత వేతనం వస్తుందో, ఆపదవి ద్వారా ఎంత ఆదాయం ఉంటుందో, అందుకే అంతగా ఖర్చు చేస్తున్నారని అనుకుంటారు. రూ.లక్షలు ఖర్చుపెట్టి ఒక్కొక్కరిని బతిమిలాడి సర్పంచ్‌గా గెలిస్తే వారికి నెలకు వచ్చే వేతనం రూ.6,500 మాత్రమే. అది కూడా నెలనెలా రాదు, ఎప్పుడో ప్రభుత్వం గ్రాంటు ఇచ్చినప్పుడు తీసుకోవాలి. 1992కు ముందు సర్పంచ్‌లకు వేతనాలు లేవు, ఆ తర్వాత చిన్న గ్రామపంచాయతీ సర్పంచ్‌లకు రూ.600, మేజర్‌గ్రామపంచాయతీల సర్పంచ్‌లకు రూ.1000మాత్రమే ఇచ్చేవారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యాక అప్పటి సీఎం కేసీఆర్ 2015 ఏప్రిల్ 1నుంచి సర్పంచ్‌ల వేతనం రూ.5వేలు చేశారు. ఆ తర్వాత 2021లో రూ.6,500కు పెంచారు. గతంలో గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తే ఖర్చులన్నా వెళ్లేవి. 2018 తర్వాత నుంచి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసినా ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచడంతో చిల్లిగవ్వ ఆదాయం రాకపోగా పనులు చేయడానికి తెచ్చిన అప్పులకు వడ్డీలు మీదపడుతున్నాయని పలువురు వాపోతున్నారు. మరి ఇంత తక్కువ వేతనం, పనులు చేసిన పైసలు రాకపోయినప్పుడు అంత పోటీ ఎందుకు, అంత ఖర్చు చేస్తారంటే సర్పంచ్ ఆగ్రామానికి ప్రథమ పౌరుడు ఆహోదా, ఆదర్శణం, దర్జా దక్కించుకోవడం కోసం ఉన్నది అమ్మి అయినా సరే అప్పులు చేసినా సరే విజయం సాధించాలని ఖర్చు చేస్తున్నారు.


నామినేషన్ వేసి బయటకు వస్తున్న కొంగర మల్లమ్మ

నామినేషన్ వేసిన కొంగర మల్లమ్మ

సంగెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కొంగర మల్లమ్మ ఎట్టకేలకు సర్పంచ్ పదవికి నామినేషన్ వేశారు. వరంగల్ జిల్లా సంగెం మండలం ఆశాలపల్లి గ్రామాన్ని స్థానిక ఎన్నికల్లో ఎస్సీ మహిళకు కేటాయించారు. గ్రామంలో 1647 ఓట్లు ఉండగా ఎస్సీ మహిళకు రిజర్వేషన్ కలిపించారు. గ్రామంలో ఒక్క కుటుంబం మాత్రమే ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. మల్లమ్మ భర్త ఇటీవల చెరువులో పడి మృతి చెందగా మల్లమ్మ ఒక్కరే గ్రామంలో నివసిస్తున్నారు. దీంతో మల్లమ్మ సోమవారం గవిచర్లలోని క్లస్టర్ నామినేషన్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ తరుపున తన నామినేషన్ వేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉత్సాహవంతులు పదవులకు పోటీ చేసేందుకు ఉత్సాహంగా నామినేషన్ కేంద్రాలకు మద్దతుదారులతో కలిసి తరలివచ్చారు. దీంతో ఇంతకాలం మల్లమ్మ రిజర్వేషన్ కలిసి రావడంతో ఇక ఈమే సర్పంచ్‌గా ఎన్నిక కాబోతున్నట్లు వాట్సాప్‌లల్లో ప్రచారం జరిగింది.

ఒకే ఊరు.. పంచాయతీలు వేరు..

- మూడు మండలాల పరిధిలో నాలుగు జీపీ కార్యాలయాలు
- గ్రామం మధ్యలో సరిహద్దు లైన్‌గా సీసీ రోడ్డు


ఒకే గ్రామంగా కనిపించే సత్యనారాయణపురం

బయ్యారం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఒక ఊరికి ఒకే పేరు ఉంటుంది.. కానీ ఆ ఊరిలో మాత్రం ఇళ్లు పక్కపక్కనే ఉన్నా రెండు గ్రామాల పరిధిలోకి వస్తాయి.. గ్రామాల పేర్లు, పంచాయతీ కార్యాలయాలు, మండలాలూ వేర్వేరుగా ఉన్నాయి.. ఇవి చూడడానికి ఒకే గ్రామంగా కనిపించనా గ్రామం మధ్య ఉన్న సీసీ రోడ్డు పంచాయతీలకు బోర్డర్ లైన్‌గా ఏర్పాటైంది. అవే జిల్లా పరిధిలోని ఉప్పలపాడు, బోడగుట్టతండా, సత్యనారాయణపురం, సంతులాల్‌పోడుతండా పంచాయతీలు.. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

మానుకోట జిల్లాలోని లక్ష్మీనరసింహాపురం గ్రామం చూడడానికి ఒకే గ్రామంగా కనిపిస్తుంది. కానీ ఆ గ్రామం మాత్రం రెండు పంచాయతీలు, మండలాల పరిధిలోకి వస్తుంది. ఒక బజారు మహబూబాబాద్ మండలం బోడగుట్ట తండా పంచాయతీ పరిధిలోకి రాగా.. మరొక బజారు బయ్యారం మండలం ఉప్పలపాడు పంచాయతీ పరిధిలోకి వస్తుంది. బోడగుట్ట తండా జీపీలో 495 ఓట్లు ఉండగా.. ఉప్పలపాడు జీపీలో 2075 ఓట్లు ఉన్నాయి. అదే విధంగా సత్యనారాయణపురం గ్రామంలో కూడా పంచాయతీలు, మండలాలు వేరు. సత్యనా రాయణపురం గ్రామంలోని ఓ బజారు బయ్యారం మండలం సంతులాల్‌పోడుతండా పంచాయతీ పరిధిలోకి రాగా.. మరో బజారు గార్ల మండలం సత్యనారాయణపురం పంచాయతీ పరిధిలోకి వస్తుంది. సంతులాల్‌పోడు తండా జీపీలో 962 ఓట్లు ఉండగా.. సత్యనారా యణపురం జీపీలో 367 ఓట్లు ఉన్నాయి. కాగా, పంచాయతీ ఎన్నికల వేళ ఈ గ్రామాలు చర్చనీయాంశంగా మారాయి. మూడు మండలాలు, నాలుగు పంచాయతీల పరిధిలో గల ఈ రెండు గ్రామాల్లోకి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు గ్రామాల గురించి ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

ఎన్నికల్లో జోరుగా 'సోషల్' మెసేజ్‌లు

- వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్న పోస్టులు
- అభ్యర్థుల తీరుపై విచిత్ర వీడియోలు



భూపాలపల్లిటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాలో చిత్ర విచిత్రమైన వీడియోలు దర్శనమిస్తున్నాయి. సర్పంచ్ అభ్యర్థుల ఎంపికలో ప్రజలు ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలో తెలిపే వ్యాసాలు కనిపించడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసే విషయంపై పలు షార్ట్ ఫిలిమ్స్ కూడా వచ్చాయి. వాటిలో సందేశాత్మక చిత్రాలూ ఉంటాయి. సర్పంచ్ అభ్యర్థులు ఏ పార్టీకి చెందిన వారైనా సరే... తమ వ్యక్తిత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలనే వ్యాసాలు సోషల్ మీడియాలో దర్శనమిస్తున్నాయి. అలాగే ఎక్కువ ఖర్చు చేసే వారికి ఓటు వేస్తే ఐదేళ్లు వారిని భరించాలని, వారు గ్రామాభివృద్ధికి పెద్దగా పనిచేయరని పేర్కొంటున్నారు. ఓటుకు నోటు తీసుకోవద్దనే మెసేజ్‌లు కూడా చక్కర్లు కొడుతున్నాయి. ఇక పోటీదారుల విషయానికి వస్తే... ఓటర్ల వద్దకు వెళ్లి నేరుగా కాళ్లు మొక్కడమే కాకుండా వారి కడుపులో తలకాయపెట్టి మరీ ఒట్టు వేయించుకోవడం పరిపాటైంది. ఇష్టమొచ్చినట్లు హామీలు ఇస్తూ ఓటర్లను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై ఓటర్లలో మిశ్రమ స్పందన కనిపిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కోతులు, కుక్కల బెడద ప్రధాన సమస్యగా మారుతోంది. దీంతో వాటిని కట్టడి చేయాలన్నదే అభ్యర్థులు ముందు ప్రజలు పెడుతున్న ప్రధాన డిమాండ్.

ఏకగ్రీవానికే జై..

(5వ పేజీ తరువాయి)

మేకల రాధ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ మిగతా వారి నామినేషన్లను విత్ డ్రా చేసుకొనేందుకు అంగీకారం తీసుకున్నారు.

జనగామ జిల్లా ఆరు..

జనగామ జిల్లాలో ఆరు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. రఘునాథపల్లి మండలంలోని వెల్ది, సోమయ్యకుంటతండా, రామన్నగూడెం, అయ్యవారిగూడెం, స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని జిట్టిగూడెం, తరిగొప్పుల మండలంలోని మాన్సింగ్‌తండా గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. రఘునాథపల్లి మండలం వెల్ది సర్పంచిగా ఏకగ్రీవమైన సింగిరెడ్డి మమత, అమె భర్త శ్రీనివాస్ గతంలో సర్పంచిగా, ఎంపీటీసీగా ఓడిపోయారు. దీంతో ఈసారి తనకు అవకాశం ఇవ్వాలని కోరగా ఎవరూ నామినేషన్ వేయలేదు. సోమయ్యకుంట తండా, అయ్యవారిగూడెంతో ప్రత్యర్థుల మధ్య బంధుత్వాలు ఉండడంతో గ్రామస్థుల చొరవతో ఏకగ్రీవం అయ్యాయి. తరిగొప్పుల మండలం మాన్సింగ్ తండా సర్పంచ్‌గా ఏకగ్రీవమైన కత్తుల కొమురయ్య గ్రామంలో దుర్గమ్మ గుడి నిర్మాణానికి కావాలసిన భూమిని గతంలో దానం ఇచ్చాడు. గుడి నిర్మాణానికి కూడా సహకరిస్తానని గతంలో మాట ఇవ్వడంతో ఎవరూ నామినేషన్ వేయలేదు.

వరంగల్ జిల్లాలో 5..

వరంగల్ జిల్లాల 5 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. వర్ధన్నపేట మండలంలో 2, రాయపర్తి మండలంలో 3 పంచాయతీలు ఏకగ్రీవంగా అయ్యాయి. రాయపర్తి మండలం కిష్టాపురంలో జనరల్‌కు రిజర్వు అయింది. ఇక్కడ భూస్వామి కొండం రంగారెడ్డికి ఊరిలో మంచి పలుకుడి, గౌరవం ఉంది. గతంలో చాలావాటికి దానధర్మాలు చేశారు. పైగా ఈయన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తమ్ముడి క్లాస్‌మేట్. దీనితో పోటీకి ఎవరూ ముందుకు రాలేదు. రంగారెడ్డి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆయన ఏకగ్రీవం ఖాయమైంది. ఇదే మండలంలోని మురిపిరాల గ్రామ పంచాయతీ కూడా ఏకగ్రీవమైంది. ఈ పంచాయతీ బీసీ జనరల్ అయింది. ఇక్కడి నుంచి సర్పంచ్‌గా ఏకగ్రీవమైన పెదగోని నాగరాజు కారోబార్. ఆయనకు గ్రామంలో మంచి పేరుంది. అన్ని వర్గాలు, పార్టీలతో కలిసి మెలిసి ఉంటాడు. దీనితో ఆయన సర్పంచ్ పదవికి అందరూ ఆమోదం తెలిపారు. దీనితో ఈ పంచాయతీలో నాగరాజు నామినేషన్ ఒక్కటే పడడంతో ఆయన ఏకగ్రీవం ఖాయమైంది. ఇదే మండలంలోని బాలాజీనగర్ గ్రామ పంచాయతీ కూడా ఏకగ్రీవమైంది. ఈ పంచాయతీ ఎస్టీ జనరల్. సర్పంచ్‌గా బానోతు మోహన్‌లాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్‌కు స్వయాన తమ్ముడు. ఆయన చొరవ, గ్రామాభివృద్ధికి హామీతో మోహన్‌లాల్ ఎన్నికకు మార్గం సుగమం అయింది. వర్ధన్నపేట మండలంలోని రామోజీ కుమ్మరిగూడెం పంచాయతీ కూడా ఏకగ్రీవమైంది. ఇది ఎస్టీ మహిళకు రిజర్వు అయింది. ఇక్కడి నుంచి భూక్య సుశీల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామాభివృద్ధికి రూ.8లక్షలు ఇస్తానని ప్రకటించిన మీదట స్థానికులు ఏకగ్రీవానికి ఒకే చేశారు. ఇదే మండలంలోని చంద్రుగొండ గ్రామ పంచాయతీ కూడా ఇదే మాటలో నడిచింది. ఎస్టీ మహిళకు రిజర్వే అయిన ఈ పంచాయతీ నుంచి భూక్య నీల రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే గ్రామాభివృద్ధికి రూ.8లక్షలు ఇస్తానని మాట ఇచ్చినందుకు స్థానికులు ఒకే చేశారు.

భూపాలపల్లి జిల్లాలో ఒకటి..

భూపాలపల్లి జిల్లాలో ఒకే ఒక గ్రామ పంచాయతీ ఏకగ్రీవమైంది. గోరి కొత్తపల్లి మండలం చెంచుపల్లి గ్రామ పంచాయతీ ఎస్టీ జనరల్‌కు రిజర్వు అయింది. ఇక్కడ అంతా ఎస్టీలే. ఒక్క నామినేషనే దాఖలైంది. వీరంతా కలిసి జెల్లా రాంబాబును సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని ఇచ్చిన హామీ మేరకు ఏకగ్రీవమైంది.

మహబూబాబాద్ జిల్లాలో మూడు..

మహబూబాబాద్ జిల్లాలో మూడు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. కేసముద్రం మండలంలో రెండు, ఇనుగుర్తిలో ఒక గ్రామపంచాయతీ ఏకగ్రీవం అయినవాటిలో ఉన్నాయి. ఒక్కొక్క నామినేషన్ దాఖలు చేయడం ఈ మూడు జీపీలు ఏకగ్రీవం కానున్నాయి. కేసముద్రం మండలంలో నూతనంగా ఏర్పాటైన చంద్రుతండ ఎస్టీకి రిజర్వు అయింది.

ఈ పంచాయతీలో అత్యల్పంగా 370మంది ఓటర్లే ఉండడం, అంతా ఒక్కచోట చేరి కూర్చొని చర్చించుకొని ఏకగ్రీవానికి నిర్ణయం తీసుకున్నారు. సర్పంచ్‌గా బానోత్ శ్రీను ఎన్నికయ్యారు. కాంగ్రెస్ వ్యక్తికి సర్పంచ్, బీఆర్ఎస్‌కు ఉపసర్పంచ్ పదవిని, నాలుగు చొప్పున ఇరు పార్టీలు వార్డులను నిర్ణయించుకొని అన్ని స్థానాల్లో ఒకటి నామినేషన్‌ను దాఖలు చేశారు. ఇదే మండలంలోని నారాయణపురం ఎస్టీ మహిళకు రిజర్వు అయింది. ధరావత్ యమున ఒకే నామినేషన్ దాఖలు చేశారు. ఈ గ్రామంలోనూ ఇరుపార్టీలు సర్పంచ్, ఉపసర్పంచ్ కేటాయించుకొని ఏకగ్రీవానికి మార్గం సుగమం చేసుకున్నారు. ఇనుగుర్తి మండలం పాతతండ ఎస్టీకి రిజర్వు అయింది. ఇస్లావత్ నరేష్ ఒక్కడే నామినేషన్ వేశాడు. తండాను అభివృద్ధి చేసుకోవాలనే కాంక్షతో తండావాసులు సర్పంచ్‌ను ఏకగ్రీవం చేశారు.

గిరిజనులు లేని ఏజెన్సీ గ్రామం

- ఎస్టీలకే సర్పంచ్, మూడు వార్డులు రిజర్వు
- కోటగడ్డలో విచిత్ర పరిస్థితి



కోటగడ్డ గ్రామపంచాయతీ

సర్పంచ్‌గా ఎన్నిక కానున్న లిల్లీ

గోవిందరావుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని కోటగడ్డలో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. షెడ్యూల్డ్ గ్రామంగా గుర్తించిన ఈ ఊరిలో కేవలం ముగ్గురే గిరిజన ఓటర్లు ఉన్నారు. నిబంధనల ప్రకారంగా ఈ గ్రామ సర్పంచ్, సగం వార్డులను ఎన్నికల కమిషన్ ఎస్టీలకు కేటాయించింది. సర్పంచ్‌కు ఒక నామినేషన్ దాఖలు కాగా మూడువార్డులకు నామినేషన్ పడలేదు. దీంతో క్రితంలాగే ఈసారి కూడా ఆమూడు వార్డులు ఖాళీగా మిగలనున్నాయి. ఆరు వార్డులతో ఉన్న కోటగడ్డ గ్రామంలో పంచాయతీ ఎన్నికలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. గత ఎన్నికల్లో సర్పంచ్ పదవికి గ్రామానికి చెందిన బానోత్ లిల్లీ, కుర్సం రామక్క పోటీపడగా రామక్క విజయం సాధించారు. అయితే ఇటీవల ఆమె బతుకుదెరువు కోసం వేరే ప్రాంతానికి వలస వెళ్లింది. దీంతో ఆమె ఎన్నికల్లో పాల్గొనలేదు. లిల్లీ ఒక్కరే సింగిల్ నామినేషన్ దాఖలు చేశారు. ఆరు వార్డులకుగాను మూడు ఎస్టీలకు, మూడు జనరల్‌కు రిజర్వు చేశారు. జనరల్ వార్డులకు రెండు చొప్పున నామినేషన్లు పడగా ఎస్టీ రిజర్వు వార్డులకు నామినేషన్లు కరువయ్యాయి. దీంతో సింగిల్ నామినేషన్‌తో లిల్లీ సర్పంచ్‌గా ఎన్నిక కానున్నారు. గత ఎన్నికల్లో ఓడినప్పటికీ ఈసారి సర్పంచ్ పీఠాన్ని దక్కించుకున్నారు. అయితే నామినేషన్లు ఏమీ రాకపోవడంతో గతంలోలాగానే ఈసారి కూడా ఆమూడు వార్డులు ప్రజాప్రతినిధులు లేకుండా ఖాళీగా మిగలనున్నాయి.

అభ్యర్థులు పార్టీలకతీతంగా పోటీ చేయాలి

- పాటించకుంటే కుల బహిష్కరణ
- ప్రగతిసింగారంలో ఎస్సీల తీర్మానం


ప్రగతిసింగారంలో తీర్మానం కాపీని చూపుతున్న ఎస్సీ కుల పెద్దలు

శాయంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రగతి సింగారం గ్రామం సర్పంచ్ పదవి ఎస్సీకి రిజర్వ్ అయింది. ఈ నేపథ్యంలో సోమవారం ఎస్సీ కుల పెద్దలు గ్రామంలో సమావేశం నిర్వహించి తీర్మానం చేశారు. గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా పోటీచేసే అభ్యర్థి ఎలాంటి రాజకీయ పార్టీ మద్దతు లేకుండా స్వతంత్రంగా పోటీ చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ నిబంధనను తప్పక పాటించాలని, ఉల్లంఘిస్తే కుల బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. పార్టీల పరంగా పోటీపడి అధికంగా ఖర్చులు చేసి, అభ్యర్థుల కుటుంబాలు రోడ్డున పడకూడదనే ఉద్దేశంతోనే ఈ తీర్మానం చేసినట్లు తెలిసింది. ఈ విషయం మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

యమ కిలాడీ.. ఈ నకిలీ డీఎస్పీ..


వివరాలు వెల్లడిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

- అవినీతి చిట్టా తెలుసుకొని ఏసీబీ పేరిట గాలం
- ఎంవీఐ తుమ్మల జైపాల్‌రెడ్డికి బెదిరింపులు
- ఆన్‌లైన్‌లో రూ.9లక్షల96 వేలు వసూలు
- ముఠాను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్, మిల్స్‌కాలనీ పోలీసులు
- వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రోజూ పత్రికల్లో ప్రచురితమయ్యే అవినీతి అధికారుల వివరాలను తెలుసుకొని ఏసీబీ డీఎస్పీ పేరిట ఫోన్‌చేసి లక్షల్లో డబ్బులు వసూలు చేసిన నకిలీ ఏసీబీ డీఎస్పీ ముఠాను టాస్క్‌ఫోర్స్, మిల్స్‌కాలనీ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు. వరంగల్ ఆర్టీవో కార్యాలయంలో ఎంవీఐగా విధులు నిర్వర్తిస్తున్న తుమ్మల జైపాల్‌రెడ్డికి అక్టోబరు నెలలో గుర్తుతెలియని వ్యక్తి ఏసీబీ డీఎస్పీనంటూ ఫోన్ చేసి బెదిరించాడు. దీంతో సుమారు రూ.9.60 లక్షలు దశలవారీగా జైపాల్‌రెడ్డి ముట్టజెప్పాడు. తర్వాత జైపాల్‌రెడ్డి మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అనంతరం వివిధ మార్గాలను అన్వేషించి చివరికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పుట్టపర్తి జిల్లాలోని వేలమద్ది గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు రాచంపెల్లి శ్రీనివాస్‌తోపాటు సహకరించిన కర్ణాటక రాష్ట్రంలోని బెంగూళూరుకు చెందిన నవీన్, మంగళ రవీందర్, మురళి, ప్రసన్నలను అక్కడే ఆదుపులోకి తీసుకోగా, అందే ప్రాంతానికి చెందిన సూర్యప్రకాశ్, తాటిమర్రి వేణు, కొత్తకోట రమణ పరారీలో ఉన్నారు. కాగా, నిందితుల నుంచి 13 సెల్‌ఫోన్‌లతోపాటు రూ.9,700 నగదును స్వాధీనం చేసుకున్నారు.

విచారణలో విస్తుపోయే నిజాలు

ప్రధాన నిందితుడైన రాచంపల్లి శ్రీనివాస్ 7వ తరగతి చదివి ఓ ఎస్సై దగ్గర డ్రైవర్‌గా చేరాడు. పోలీసులతో తిరిగిన నిందితుడు కేసుల గురించి అవగాహన పెంచుకున్నాడు. 2002లో మొదటగా జల్సాల కోసం ద్విచక్రవాహనం చోరీ చేశాడు. అనంతరం రాయలసీమ ప్రాంతంలో దొంగతనాలకు పాల్పడిన నిందితుల ఇంటికి పోలీసుగా వెళ్లి చోరీ చేసిన సొమ్ము ఎక్కడ దాచారని బెదిరించి డబ్బులు, బంగారం లాక్కున్నాడు. ఇలా సుమారుగా 50 ఘటనల్లో పాల్గొనగా పోలీసులు శ్రీనివాస్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు. జైలులో ఉండగానే ఎస్కార్ట్ పోలీసులను తన వైపు తిప్పుకొని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు నటించి బయటికి వెళ్లి చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడేవాడు. ఇలా ఏకంగా 41 చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. సీసీ కెమెరాల్లో నిందితుడు కనిపించడంతో పాటు స్థానికులకు దొరికిన ఘటనలు ఉండడంతో ఉన్నతాధికారులు విచారణ చేసిన కడపలోని ఏడుగురు ఏఆర్ కానిస్టేబుళ్లను శాశ్వతంగా విధుల్లో నుంచి తొలగించారు. 9మందిలో ఒక కానిస్టేబుల్ ఏకంగా నిందితుడితో కలిసి చోరీల్లో పాల్గొన్నాడు. అనంతరం శ్రీనివాస్ మకాంను బెంగూళూరుకు మార్చాడు. అక్కడ న్యూస్ పేపర్‌లో వచ్చే అవినీతి అధికారుల చిట్టా తెలుసుకొని నకిలీ ఏసీబీ డీఎస్పీ అవతారమెత్తాడు. ఏపీ, తెలంగాణలో 19 మంది ప్రభుత్వ ఉద్యోగులను ఫోన్‌లో బెదిరించి సుమారు రూ.50 లక్షలు వసూలు చేశాడు. ఇలా 19 కేసుల్లో పాల్గొనగా, 8 కేసుల్లో అరెస్టు అయ్యాడు. మిగతా 11 కేసుల్లో రెండు ఏపీలో జరగగా, మిగతావి మిల్స్‌కాలనీ, స్టేషన్‌ఘన్‌పూర్ పీఎస్‌లతో పాటు తెలంగాణలోని ఇతర జిల్లాల్లో జరగగా తప్పించుకొని తిరుగుతున్నాడు. అక్రమంగా వసూలు చేసిన డబ్బులతో ప్రధాన నిందితుడు, అతడికి సహకరించే నలుగురు వ్యక్తులు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడేవారు. అలాగే గోవాలో కాసినో జూదం ఆడేవారు. అంతేకాక గోవా, బెంగుళూరు నగరాల్లో వ్యభిచారానికి సుమారు 82లక్షలు ఖర్చుపెట్టినట్లుగా విచారణలో ఒప్పుకున్నారు.

ప్రతిభ చూపిన పోలీసులకు రివార్డులు

నకిలీ ఏసీబీ ముఠాను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు మిల్స్‌కాలనీ పోలీసులను సీపీ సన్‌ప్రీత్‌సింగ్ నగదు రివార్డులను అందజేశారు. మొత్తంగా ఈ కేసులో టాస్క్‌ఫోర్స్ సీఐ పవన్‌కుమార్ కీలకపాత్ర పోషించినట్లుగా విశ్వసనీయమైన సమాచారం.

ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, వరంగల్ ఏసీపీ శుభం, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్స్ పవన్‌కుమార్, శ్రీధర్, మిల్స్‌కాలనీ ఇన్స్‌పెక్టర్ బొల్లం రమేశ్, ఎస్సై మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్



మాజీ సర్పంచ్‌కు బీజేపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న సుభాష్

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):తాటికొండకు చెందిన బీఆర్ ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ సానాది సంధ్య-రాజు సోమవారం బీజేపీ నాయకుడు బొజ్జపల్లి సుభాష్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. సుభాష్ మాట్లాడుతూ ప్రధాని మోదీపై అభిమానంతో గ్రామాల వారీగా వివిధ పార్టీల నాయకులు బీజేపీలో పెద్దఎత్తున చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు సట్ల వెంకటరమణ, నియోజకవర్గ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి, బూర్ల విష్ణు, తౌటిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, సట్ల సురేష్, నారబోయిన శ్రీనివాస్ , కందిమల్ల క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం పట్టివేత

చిలుపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజీగూడెంలో నిల్వ ఉంచిన అక్రమ మద్యాన్ని పట్టుకుని కేసు నమోదుచేసినట్లు ఎస్సై సిరిపురం నవీన్ కుమార్ సోమవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఉడుత రాజయ్య స్థానికంగా బెల్టు షాపు నిర్వహిస్తున్నాడు. ఇటీవల అక్కడ కొందరు మందుబాబులు అతిగా మద్యం సేవించి గలాటా సృష్టించినట్లు సమాచారం అందింది. ఈ మేరకు సిబ్బందితో దాడులు చేపట్టగా, రూ.4వేల విలువ గల మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కేటీఆర్ జోలికి వస్తే ఊరుకోం...



సమావేశంలో మాట్లాడుతున్న తిరుమల్‌రెడ్డి

జనగామ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కేటీఆర్ జోలికి వస్తే ఊరుకోమని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు రావుల తిరుమల్‌రెడ్డి హెచ్చరించారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో తిరుమల్‌రెడ్డి మాట్లాడుతూ కేటీఆర్ నాయకత్వాన్ని మెచ్చుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అనేక పదవులు పొంది, ఇప్పుడు రాజకీయ లబ్ధికోసం కేటీఆర్‌పై నోటికి వచ్చినట్లు మాట్లాడుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. కడియం రాజకీయ అవినీతి ప్రతీకగా హార్పిక్, బాత్రూమ్ కడిగే బ్రెష్‌ను పంపించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్ నాయక్, శశి, యాకన్న, తరుణ్, రంజిత్, ప్రదీప్, సాయి పాల్గొన్నారు.

చంద్రయ్య కుటుంబానికి ఆర్థిక సాయం

జఫర్‌గఢ్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తమ్మడపల్లి(జి)కి చెందిన కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రాపర్తి చంద్రయ్య ఇటీవల అనారోగ్యంతో చనిపోవడంతో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నం బ్రహ్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు సోమవారం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబీకులను పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుజ్జరి రాజు, మాజీ వైస్ చైర్మన్ మారపల్లి ప్రభాకర్, సొసైటీ మాజీ చైర్మన్ చిటిమల్ల కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ అన్నెపు అశోక్ పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుల బైండోవర్



తహసీల్దార్ ఎదుట బైండోవర్ అయిన బెల్ట్‌షాపు నిర్వాహకులు

బచ్చన్నపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న వారిని సోమవారం తహసీల్దార్ రామానుజాచారి ఎదుట బైండోవర్ చేసినట్టు ఎస్ఐ ఎస్‌కే హమీద్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న 16 మందిని బైండోవర్ చేశామని, ఎవరైన మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. బైండోవర్ చేసిన వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

ప్రలోభాలకు గురిచేయొద్దు..

బచ్చన్నపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని, ప్రలోభాలకు గురై ఎన్నికల విధానాన్ని అపహాస్యం చేయరాదని తహసీల్దార్ రామానుజాచారి, ఎంపీడీవో మమతాబాయి అన్నారు. సోమవారం సాల్వాపూర్‌లో సర్పంచ్ అభ్యర్థులకు రెండో రోజు నామినేషన్లు రాకపోవటంతో అధికారులు గ్రామస్థులతో సమావేశమై అవగాహన కల్పించారు. ఎస్ఐ అబ్దుల్ హమీద్, ఆర్ఐ మున్వర్ పాల్గొన్నారు.

తీగలతండా ఏకగ్రీవం

చిలుపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తీగలతండా పాలకవర్గం ఏకగ్రీవమైంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఇటీవల సర్పంచ్ పదవికి ఇద్దరు నామినేషన్లు దాఖలు చేయగా, ఎనిమిది వార్డులకు ఒక్కరేసి చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. సర్పంచ్ బరిలో ఉన్న తీగల అశోక్ సోమవారం తన నామినేషన్‌ను ఉపసంహరించుకోగా, మరో వ్యక్తి తీగల సాంబరాజుతోపాటు, ఎనిమిది మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక అధికారులు అధికారికంగా ప్రకటించడమే తరువాయి.

జోరుగా నామినేషన్లు



అంకుషాపూర్‌లో సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న రమ్య

తరిగొప్పుల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలలో భాగంగా మండలంలో అధికారులు ఏర్పాటు చేసిన 5 క్లస్టర్లలో రెండవ రోజు(సోమవారం) నామినేషన్ల ప్రక్రియ జోరుగా సాగింది. ఈ సందర్భంగా అధికారులు మండలంలోని 15 సర్పంచ్ స్థానాలకు గాను 11 మంది అభ్యర్థులు, 126 వార్డులకు గాను 20 మంది అభ్యర్థుల నుంచి నమినేషన్లు స్వీకరించారు.

● బచ్చన్నపేట: సర్పంచ్ ఎన్నికల సందర్భంగా బరిలో ఉంటున్న అధికార, ప్రతిపక్ష పార్టీలు బలపర్చిన అభ్యర్థులతో పాటు పార్టీలతో సంబంధం లేకుండా పోటీలో ఉంటున్నవారు తమ ప్రజాబలం చూపేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. సోమవారం తమ్మడపల్లికి చెందిన బేజాడి సిద్దులు వందలాది మంది గ్రామస్థులతో వచ్చి బచ్చన్నపేటలో నామినేషన్ వేశారు. బచ్చన్నపేటకు చెందిన పైస రాజశేఖర్, చింతల వెంకటేశ్వర్లు, పడమటికేశ్వాపూర్ జంగిటి సంగీత విద్యానాథ్, వీఎస్ఆర్ నగర్‌కు చెందిన కోనేటి వాణిశ్రీ, గొడుగు రేణుక, కొన్నెలో కోడూరు స్వర్ణలత శివకుమార్‌గౌడ్, లింగంపల్లికి చెందిన మద్దికుంట రాధ నామినేషన్లు వేశారు.

● జనగామ రూరల్: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రెండో రోజు మండలంలో నామినేషన్ ప్రక్రియ కొనసాగింది. సోమవారం మంచి రోజు కావడంతో అభ్యర్థులు మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు నామినేషన్లు వేశారు. జనగామ ఎంపీడీవో మహేశ్ నాయక్, ఎంపీవో సంపత్ కుమార్‌లు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. జిల్లా ఎన్నికల అబ్జార్వర్ శామీర్‌పేటలో ఎన్నికల నామినేషన్ ప్రక్రియను అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ వడ్లకొండలో నామినేషన్ ప్రక్రియ పరిశీలించారు. నామినేషన్ రిజిస్టర్లు, దరఖాస్తుల స్వీకరణను తనిఖీ చేశారు.



భారీ జనంతో తరలివచ్చిన తమ్మడపల్లి సర్పంచ్ అభ్యర్థి సిద్దులు



నామినేషన్ వేస్తున్న పెంబర్తి బీఆర్ఎస్ అభ్యర్థి విజయసిద్ధిలింగం

కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు వీరే..

బచ్చన్నపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14న జరిగే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థుల వివరాలను సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జి బండకింది హరిబాబుగౌడ్ ప్రకటించారు. సాల్వాపూర్-బత్తిని వెంకటేశ్, మన్‌షాన్‌పల్లి- గడిచర్ల శ్రీనివాస్, లింగంపల్లి-ఒగ్గు కవిత, పడమటికేశ్వాపూర్-జంగిటి సంగీత, నాగిరెడ్డిపల్లి-ఇరుగు ప్రకాశ్, నక్కవానిగూడెం-కంద్రాజు రవీందర్, కట్కూరు-బల్ల రవీంద్రానాథ్, చిన్నరామన్‌చర్ల- పిన్నింటి కావ్యశ్రీరెడ్డి, బండనాగారం- ఇజ్జగిరి రాములు, నారాయణపూర్-పరిదె స్వప్న, ఇటుకాలపల్లి- జేరిపోతుల రాజు, కొడవటూరు-మల్లం శ్రీలత, గంగాపూర్- ఎడ్ల మధుసూదన్‌రెడ్డి, పోచన్నపేట- కొయ్యడ శ్రీనివాస్, లక్ష్మాపూర్-శివరాత్రి పూజిత, దబకుంటపల్లి- కందుల పూజ, బోనకొల్లూరు-చిక్కుడుకల్పన, ఆలీంపూర్-పాకాలలలిత, గోపాల్‌నగర్-పూర్ణ భార్గవి, కేశిరెడ్డిపల్లి - బాల్నే రాజేశ్, బసిరెడ్డిపల్లి- నల్ల సిద్దినర్సవ్వ, వీఎస్ఆర్‌నగర్-గొడుగు రేణుక, బచ్చన్నపేట-అల్వాల నర్సింగరావు పేర్లు ప్రకటించారు.

కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు : డీసీపీ

బచ్చన్నపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రెండో విడత పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న బచ్చన్నపేట మండలంలో నామినేషన్ కేంద్రాల వద్ద కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు చేసినట్టు డీసీపీ రాజమహేంద్ర నాయక్ తెలిపారు. సోమవారం మండల కేంద్రం బచ్చన్నపేట, పోచన్నపేట, కొడవటూరు నామినేషన్‌కేంద్రాలను పరిశీలించారు. అధికారులకు తగిన సూచనలు చేశారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగినఏర్పాట్లు చేస్తున్నామని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ అబ్బయ్య, ఎస్ఐ ఎస్‌కే హమీద్ తదితరులు పాల్గొన్నారు.



పోచన్నపేటలో ఆర్‌వోలతో మాట్లాడుతున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

మూడో విడత నామినేషన్లకు ఏర్పాట్లు

పాలకుర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మూడో విడతలో జరిగే పాలకుర్తి మండలంలోని 38 గ్రామ పంచాయతీల సర్పంచులు, వార్డు సభ్యుల ఎన్నికల కోసం క్లస్టర్ల వారీగా నామినేషన్లు స్వీకరిస్తారని ఎంపీడీవో వేదవతి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆమె మాట్లాడారు మండలంలో మొత్తం 12 క్లస్టర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వల్మిడి క్లస్టర్‌లో వల్మిడి, ముత్తారం, మంచుప్పుల గ్రామ నామినేషన్లు సమర్పిస్తారన్నారు. చెన్నూరు క్లస్టర్‌లో చెన్నూరు, గుడికుంటతండా, షైలారం, అలాగే విస్నూరు క్లస్టర్‌లో విస్నూరు, తీగారం, హరిజనకాలనీ, చీమలబాయి తండా, తొర్రూరు క్లస్టర్‌లో తొర్రూరు, దుబ్బతండా (ఎస్‌పీ), శాతాపురం, లక్ష్మీనారాయణపురంల నామినేషన్లు దాఖలు చేయాలి. ఈరవెన్ను క్లస్టర్‌లో ఈరవెన్ను, కోతులబాదు, తిర్మలగిరి, గూడూరు క్లస్టర్‌లో గూడూరు, గోపాలపురం, నర్సింగాపురం తండా, కిష్టపురంతండా గ్రామ పంచాయతీ సర్పంచు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయాలని తెలిపారు. బమ్మెర క్లస్టర్‌లో బమ్మెర, పెద్దతండా (బీ), రాఘవాపురం, పాలకుర్తి క్లస్టర్‌లో పాలకుర్తి, అయ్యంగారిపల్లి, దర్దెపల్లి క్లస్టర్‌లో దర్దెపల్లి, దుబ్బతండా(టీ), తుమ్మసముద్రం కుంట తండా, సిరిసన్నగూడెం, కొండాపురం క్లస్టర్‌లో కొండాపురం, పెద్దతండా (కే), మేకలతండా, మల్లంపల్లి క్లస్టర్‌లో మల్లంపల్లి, బీక్యానాయక్ పెద్దతండా, హత్యాతండా, వావిలాల క్లస్టర్‌లో వావిలాల, నారబోయినగూడెం గ్రామ పంచాయతీ సర్పంచు, వార్డు సభ్యుల అభ్యర్థులు నామినేషన్లు సమర్పించాలని తెలిపారు.



రాజయ్య సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన సునీత మహిపాల్ రెడ్డి

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేత

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తానేదార్‌పల్లి నుంచి కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా సర్పంచ్ బరిలో ఉన్న మంతెన సునీత-మహిపాల్ రెడ్డి సోమవారం మాజీ ఎమ్మెల్యే రాజయ్య సమక్షంలో హన్మకొండలోని ఆయన నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన సునిత బీఆర్ఎస్ పార్టీలో చేరడంతో బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలువనున్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కనకం గణేష్, చల్లా చందర్ రెడ్డి, మాచర్ల రఘురాములు, గాదె పురుషోత్తం, రంజిత్ కుమార్, అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయానికి చేరిన
బ్యాలెట్ బాక్స్‌లు

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్టేషన్‌ఘన్‌పూర్ మండల పరిధిలో ఈ నెల 11న జరగనున్న సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల కోసం కలెక్టరేట్ నుంచి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయానికి సోమవారం బ్యాలెట్‌బాక్స్‌లను తరలించారు. మండలంలో 15 గ్రామాల పరిధిలో మొత్తం 146 పోలింగ్ బూత్‌లు ఉండగా కలెక్టరేట్ నుంచి 170 బ్యాలెట్ బాక్స్‌లను పంపించారు. 15 గ్రామాల్లో జిట్టెగూడెం గ్రామంలో 8వార్డులు, సర్పంచ్ ఏకగ్రీవం కావడంతో మిగితా 138 పోలింగ్ కేంద్రల్లో ఎన్నికలు జరుగనున్నాయి. 10న గ్రామాల వారీగా బ్యాలెట్‌బాక్స్‌లను పోలింగ్ కేంద్రాలకు పంపించనున్నట్లు ఎంపీడీవో నర్సింగరావు తెలిపారు.



ఎంపీడీవో కార్యాలయంలో బ్యాలెట్ బాక్స్‌లు చేర్చుతున్న సిబ్బంది

అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని రాస్తారోకో

జనగామ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జనగామలోని బాణాపురం అండర్ పాస్ బ్రిడ్జిని నిర్మించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు సోమవారం బైపాస్ రోడ్డుపై రాస్తారోకో చేశారు. పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ మాట్లాడుతూ అండర్ బ్రిడ్జిని నిర్మించాలని గతంలో 132 రోజులు రిలే నిరాహార దీక్షలు చేసినా, ఎమ్మెల్యే, ఎంపీలకు వినతి పత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సంఘటనా స్థలానికి జనగామ సీఐ సత్యనారాయణ రెడ్డి చేరుకొని ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ అజారుద్దీన్, బూడిద ప్రశాంత్, ధరావత్ మహేందర్, పల్లెర్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో బైపాస్ రోడ్డుపై ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ

● మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పుష్పకుమారి

నర్మెట డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అవగాహనతోనే ఎయిడ్స్‌ను నియంత్రించవచ్చని మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ పుష్పకుమారి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మోడల్ స్కూల్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ అవగాహన ర్యాలీ, విద్యార్థుల ప్రసంగాలు, పోస్టర్ ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జానీనాయక్, ఉపాధ్యాయులు సురేష్, బాబు, శాంతికిరణ్ రోజారమణి తదితరులు పాల్గొన్నారు.



నర్మెటలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పుష్పకుమారి

రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రాజెక్టు

(5వ పేజీ తరువాయి)

హెచ్ఎం డి.సదానందం తెలిపారు. సోమవారం ప్రతిభా విద్యార్థి చరణ్, గైడ్ టీచర్ శ్రవణ్‌కుమార్‌ను పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ బొల్లం పద్మ, గోపు సోమయ్య అభినందించి సత్కరించారు. అలాగే జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఎగ్జిబిట్లను ప్రదర్శించి ప్రోత్సాహక బహుమతులు అందుకున్న విద్యార్థులను సైతం వారు అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

లింగాలఘణపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఎస్సై శ్రవణ్‌కుమార్ ప్రకారం. కళ్లెం గ్రామానికి చెందిన వనపర్తి రాములు(60) గత నెల 26న లింగాలఘణపురం-కళ్లెం గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్రవాహనంపై కళ్లెం వెళ్తున్న రాములు ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాములకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రాములు (ఫైల్)

సైన్స్‌ఫెయిర్‌లో మెరిసిన సెయింట్ పాల్స్ విద్యార్థులు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న హెచ్ఎం ఫాదర్ మరియ జోసఫ్

జనగామ రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లా కేంద్రంలోని సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో విజేతగా నిలిచారు. నవంబరు 28, 29 జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో సెయింట్ పాల్స్‌కు చెందిన విద్యార్థులు వివిధ రకాల సైన్స్, మాథ్స్ ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించి నాలు ప్రథమ బహుమతులను గెలుచుకున్నారు. హెచ్ఎం రెవరెండ్ ఫాదర్ మరియ జోసఫ్ సోమవారం విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లను అందజేశారు.

రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపికైన విద్యార్థి



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ శ్రీధర్, ఉపాధ్యాయులు

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : శివునిపల్లిలోని లయోలా హైస్కూల్ విద్యార్థి ఎ.ప్రణీత్ ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి సైన్స్‌ఫెర్‌కు ఎంపికయ్యాడు. సోమవారం పాఠశాలలో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థి ప్రణీత్‌తోపాటు జిల్లా స్థాయి సైన్స్‌ఫెర్‌లో ప్రతిభ కనబరిచిన ఇ.స్వస్తిక ఆర్తి, పి.అక్షితను కరస్పాండెంట్ శ్రీధర్, ప్రిన్సిపాల్ వై.శ్రీనివాస్ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యసభ్యులు శంకర్, సత్యం, ఉపాధ్యాయులు టి.మధు, కె.రమేష్, టి.రాజు, శ్రీధర్, రజిత, వసంత, కవిత, రవీందర్, ఎలేంద్ర, లలిత, శ్రీలత, సుధాకర్, సుష్మ, అనిత పాల్గొన్నారు.

రైతులకు డబ్బులు చెల్లించాలి

కేసముద్రం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం మార్కెట్‌లో మార్క్‌ఫెడ్‌కు మొక్కజొన్నలను విక్రయించిన రైతులకు వెంటనే డబ్బులు చెల్లించాలని కోరుతూ చైర్మన్ గంట సంజీవరెడ్డికి సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి మార్తినేని పాపారావు, పార్టీ మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న, చాగంటి కిషన్, మోడెం వెంకటేశ్వర్లు, కావటి నర్సయ్య, జల్లె జయరాజు పాల్గొన్నారు.

కబడ్డీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా సురేష్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అసోసియేట్ జాయింట్ సెక్రటరీగా జాతీయ మాజీ కబడ్డీ క్రీడాకారుడు తోట సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాసాని వీరేష్ ముదిరాజ్, మద్ది మహేందర్ సోమవారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట కొమ్ముల వంచకు చెందిన సురేష్ రాష్ట్ర కబడ్డీ క్రీడాఅభివృద్ధి కోసం కృషిచేశారని పేర్కొన్నారు.

యాసిడ్ కలకలం

● బీఎస్సీ నర్సింగ్ విద్యార్థినిపై యాసిడ్‌తో దాడి

మడికొండ/జఫర్‌గఢ్, డిసెంబరు 1 (ఆంధ్ర్యజ్యోతి): వరంగల్ నగరంలో యాసిడ్ కలకలం రేగింది. కాజీపేట మండలం కడిపికొండలో నర్సింగ్ విద్యార్థినిపై గుర్తు తెలియని దుండగులు యాసిడ్ దాడికి పాల్పడిన ఘటన దావానంలా వ్యాపించింది. పోలీసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం వడ్డెగూడెం గ్రామానికి చెందిన తాటికాయల కుమారస్వామి కుమార్తె తాటికాయల సునంద హనుమకొండలో బీఎస్సీ నర్సింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం కళాశాలలో హాల్‌టికెట్ తీసుకొని తన అమ్మమ్మ గ్రామమైన ఐనవోలు మండలం వెంకటాపురం గ్రామానికి వెళ్లడానికి సాయంత్రం 6.15 గంటలకు స్కూటీపై బయలుదేరింది. కడిపికొండ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు రాగానే సుమారు 40ఏళ్ల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి బండిపై వచ్చి తనపై ఏదో పోసినట్లు అనిపించిందని యువతి ఫిర్యాదులో పేర్కొన్నది. తన కాలిపై మంటగా అనిపించడంతో బంధువులకు సమాచారం అందించింది. సమాచారం తెలిసిన మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ ఘటనా స్థలానికి చేరుకొనియువతిని హుటాహుటిన ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా, యువతికి వైద్యులు చికిత్స అందించారు. శరీరంలో 7 శాతం కాలిందని పేర్కొన్నారు. యువతి స్వల్ప గాయాలతో బయట పడడంతో కుటుంబసభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కాగా, గతంలో కిట్స్ కళాశాల విద్యార్థినులపై యాసిడ్ దాడి జరిగి ఒక విద్యార్థిని మృతి చెందిన ఘటన తర్వాత మళ్లీ అదే తరహాలో ఈ సంఘటన జరగడంతో నగరం ఉలిక్కిపడింది.

కొనసాగిన నామినేషన్ల పర్వం

(5వ పేజీ తరువాయి)

గ్రామాలలో నామినేషన్‌ల ప్రక్రియ రెండో రోజు జోరు పుంజుకుంది. మండలంలోని 17 గ్రామాలకు నాలుగు క్లస్టర్‌లలో సర్పంచ్‌లకు 49, వార్డు సభ్యులకు 69 నామినేషన్‌లు దాఖలఅయ్యాయి. నర్మెట క్లస్టర్‌లో సర్పంచ్‌లకు 19, వార్డు సభ్యులకు 20, మచ్చుపహాడ్ క్లస్టర్‌లో సర్పంచ్‌లకు 13, వార్డు సభ్యులకు 28, హన్మంతాపూర్ క్లస్టర్‌లో సర్పంచ్‌లకు 7, వార్డు సభ్యులకు 6, వెల్దండ క్లస్టర్‌లో సర్పంచ్‌లకు 10. వార్డు సభ్యులకు 15 నామినేషన్‌లు దాఖలు అయినట్లు ఎంపీడీవో కావ్యశ్రీనివాసన్ తెలిపారు.

● తరిగొప్పుల: పంచాయతీ ఎన్నికలలో భాగంగా మండలంలో అధికారులు ఏర్పాటు చేసిన 5 క్లస్టర్లలో రెండో రోజు(సోమవారం) నామినేషన్ల ప్రక్రియ జోరుగా సాగింది. ఈ సందర్భంగా అధికారులు మండలంలోని 15 సర్పంచ్ స్థానాలకు 11 మంది అభ్యర్థులు, 126 వార్డులకు 20 మంది అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు.